క్లుప్తంగా

పుల్లగుంటను కాపాడాలని నిరసన



ధర్నా చేస్తున్న గడ్డకిందపల్లి గ్రామస్తులు

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి పంచాయతీ గడ్డకిందపల్లి సమీపంలోని పుల్లగుంటను కాపాడాలని గ్రామస్తులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పుల్లగుంటను ఓ వ్యక్తి ఆక్రమించుకుని పూడ్చి వేస్తున్నట్లు ఆరోపించారు. ఇందులో గడ్డకిందపల్లి హెచ్‌డబ్ల్యూకు 75 సెంట్ల భూమిని శ్మశానానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ కుంట పశువుల దాహార్తిని తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. స్పందించిన తహసీల్దార్ విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చెస్ టోర్నమెంట్‌లో నారాయణ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న నారాయణ స్కూల్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: చిత్తూరులో ఆదివారం జరిగిన ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ఎంఆర్ పల్లి న్యూ బాలాజీ కాలనీలోని ఏబీడీ నారాయణ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న గౌరవ వెంకట్ అండర్ -15 విభాగంలో రెండో స్థానంలో నిలిచాడు. అతన్ని ఏజీఎం ఎం.కిషోర్ అభినందించారు. పాఠశాల ఆర్ఐ వసంతకుమార్ మాట్లాడుతూ చదరంగంలో మేధాశక్తి, విజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం కలిసి ఉంటాయన్నారు. వాటిని ఇంకా మెరుగు పరుచుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ షాహిద్ విద్యార్థిని అభినందించారు.

ప్రభుత్వ భూమిని ప్రజావసరాలకు వినియోగించండి



నిరసన తెలుపుతున్న మహిళలు


చంద్రగిరి: గ్రామంలోని ప్రభుత్వ భూమిని ప్రజల అవసరాల కోసం వినియోగించాలని మండలంలోని ముంగిళిపట్టుకు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. ముంగిళిపట్టుకు చెందిన టీటీడీ నాయకుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంపై మహిళలు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని గ్రామస్తుల అవసరాల కోసం వినియోగించాలంటూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ముంగిళిపట్టులోని ప్రభుత్వ స్థలంలో ఆస్పత్రి భవనం ఉండేదని, దాన్ని గ్రామానికి చెందిన కొంతమంది కూల్చివేసి పట్టాలు సృష్టించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారని తెలిపారు. ఆ పట్టాను రెవెన్యూ అధికారులు 2018లో రద్దు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం మళ్లీ అక్రమ నిర్మాణాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

పేదలకు అల్పాహారం వితరణ



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద సుమారు 400 మంది రోగులు, వారి సహాయకులకు అల్పాహారం వితరణ చేశారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఎం.భాస్కర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ తిరుపతి స్మార్ట్ సిటీ సేవే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. లయన్స్ క్లబ్ తిరుపతి స్మార్ట్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సోమయ్య, వికాస్ మాట్లాడుతూ సభ్యుడు హరి సహకారంతో ఈ వారం ఆస్పత్రి వద్ద పేదలకు అల్పాహారం అందజేసినట్లు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ తిరుపతి స్మార్ట్ సిటీ ప్రతినిధులు బాబు నాయుడు, ఈశ్వరయ్య, శ్రీహరి, పద్మనాభం, సురేష్, శీను పాల్గొన్నారు.

అన్నదానం



అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రుయా ఆస్పత్రి వద్ద సుమారు వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి కాకర్ల సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో తలకోన ఆలయ చైర్మన్ అంతిమయాత్ర

ఎర్రావారిపాళెం: తలకోన ఆలయ చైర్మన్ కోడి ఉమామహేశ్వరరెడ్డి అంతిమయాత్ర ఆదివారం అశ్రునయనాల మధ్య సాగింది. నిత్యం ప్రజా సేవలో ఉండే నాయకుడిగా పేరుపొందిన ఉమమహేశ్వరరెడ్డికి స్థానికులు కన్నీటితో వీడ్కోలు పలికారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, ఎంపీపీ శివలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఆర్‌సీరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దేపట్ల నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, సీఐ తులసిరాం పాల్గొన్నారు.

ముత్యపు పందిరిపై కోనేటిరాయుడు



సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడికి మంగళహారతిని ఇస్తున్న అర్చక స్వాములు



ముత్యపు పందిరిపై అభయమిస్తున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి

- వైభవంగా సాగుతున్న కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- ఉదయం సింహ వాహనంపై విహారం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లు ముత్యపు పందిరిపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. భక్తుల కోలాటాలు, పండరి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం రాత్రి శుద్ధి, ఏకాంత సేవలతో స్వామి వారిని విశ్రమింపజేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు యోగ ముద్రలో నృసింహ అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. తెల్లవారుజామునే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. తర్వాత స్వామి వారి ఉత్సవ మూర్తిని అలంకార మండపంలోకి తీసుకెళ్లి సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్వామి నాలుగు మాడవీధుల్లో విహరించారు. తదుపరి ఆలయ అర్చకులు టీటీడీ ఉన్నతాధికారులకు సర్కారు హారతి అందజేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రాంగణంలో ఊంజల్ సేవ చేపట్టారు. కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ఏవీఎస్‌ఓ విశ్వనాథం, వీఐ సురేష్, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలుగో రోజు మంగళవారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



గోవింద నామస్మరణ మధ్య నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతున్న దేవదేవుడు

బర్డ్‌లో అత్యుత్తమ వైద్యసేవలు



ఆస్పత్రిలో రోగిని పరామర్శిస్తున్న పోకల అశోక్ కుమార్

తిరుపతి తుడా: బర్డ్ ఆస్పత్రిలో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నట్టు టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డితో కలిసి ఆస్పత్రిలో వైద్య సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బర్డ్‌లో ఎప్పటికప్పుడు అత్యాధునిక వైద్య పరికరాలను సమకూరుస్తున్నట్లు చెప్పారు. అత్యాధునిక సిటీ ఎక్స్‌రే సదుపాయంతోపాటు ఇటీవల సెంట్రల్ ల్యాబ్ బ్లడ్ బ్యాంకులను విస్తరించినట్లు చెప్పారు. రోగులకు వైద్యంతో పాటు పోషకాహారం, రవాణా చార్జీలను సైతం టీటీడీ అందజేస్తున్నట్టు చెప్పారు. టీటీడీ, ఎస్వీబీసీ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తున్నట్టు వివరించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ జయలక్ష్మి, హెడ్ నర్స్ విజయభారతి, వైఎస్సార్ సీపీ నాయకులు బండ్ల లక్ష్మీపతి రాయల్ పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

– 213 మంది ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న చీఫ్ ఇంజినీరు వరకుమార్, పక్కన ఎస్ఈ కృష్ణారెడ్డి

తిరుపతి రూరల్:ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్-1104 యూనియన్ 73వ వార్షికోత్సవం సోమవారం తిరుపతిలోని విద్యుత్ నిలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 213 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. యూనియన్ డిస్కం కార్యదర్శి దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ కృషి చేస్తోందన్నారు. విద్యుత్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ల చరిత్రలో రక్తదానం చేసిన చీఫ్ ఇంజనీరుగా ఎస్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ సీఈ వరకుమార్ చరిత్ర సృష్టించారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు ఫోన్ ద్వారా సీఈ వరకుమార్‌ను అభినందించారు. 1104 యూనియన్ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపి, కార్యదర్శి పాండురంగయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని 10 డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

17న దళిత గిరిజన జేఏసీ సదస్సు

తిరుపతి కల్చరల్: బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో 17న దళిత, గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాలకుల ప్రజావ్యతిరేక నిర్ణయాలతో దళితులు, గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దళితులు, గిరిజనులకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఐఏఎస్, ఐఆర్‌ఎస్, ఐపీఎస్ మేధావులు అందరూ ఐక్యతతో దళిత, గిరిజన జేఏసీ ఏర్పాటు చేసి దళిత, గిరిజనుల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా చేపట్టే రాయలసీమ స్థాయి సదస్సుకు అన్ని జిల్లాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు గేట్ కళాశాలలో జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ఎన్ఐఐటీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ కోర్సులో 50 శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒరిజినల్ ఆధార్ కార్డు, 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, బయోడేటాతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 7842648484లో సంప్రదించాలని కోరారు.

సిద్ధేశ్వరస్వామికి విశేష పూజలు

ఎర్రావారిపాళెం: తలకోన సిద్ధేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు చేశారు. ఉదయాన్నే గణపతి పూజ, సుబ్రమణ్యస్వామి పూజ, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిద్ధేశ్వర స్వామి, సిద్ధేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో స్వామి, అమ్మవారు నందివాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

రామచంద్రాపురం: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ వెంకట సుబ్బమ్మ ఆదేశించారు. ఆమె సోమవారం నడవలూరు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు తీసుకోవాలని పేర్కొన్నారు. హెచ్ఎం కళావతి పాల్గొన్నారు.

యధావిధిగా టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు యధావిధిగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం విశ్రాంత పురుష ఉద్యోగుల టెన్నికాయిట్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. సుబ్రమణ్యం నాయుడు, సుధాకర్‌రెడ్డి జట్టు విజయం సాధించగా బాలసుబ్రమణ్యంరెడ్డి, జనార్ధన్‌నాయుడు జట్టు రన్నరప్‌గా నిలిచింది.

కుష్టు రహిత సమాజమే ధ్యేయం

తిరుపతి ఎడ్యుకేషన్: కుష్టు రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ కార్యాలయపు న్యూక్లియస్ టీమ్ ఫిజియోథెరపిస్ట్ ఎస్వీ.రమణ తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్లో సోమవారం కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానిత మచ్చలుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే అంగవైకల్యం నుంచి బయటపడొచ్చని తెలిపారు. డీపీఎంఓ తిరుజ్ఞానం, యూపీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త వసంతమ్మ, సుగుణ పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లులోని భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబదేవికి మాఘమాసం సందర్భంగా ప్రత్యేక పూజలుచేశారు. భక్తులు పెద్దసంఖ్యలో మాఘ స్నానాలు ఆచరించి ఆలయాలకు తరలి వచ్చి పూజలుచేశారు. సాయంత్రం మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామిని ఘనంగా ఊరేగించారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు



ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని చేపడుతున్న నిర్మాణం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పంచాయతీలో సోమవారం ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తిరుపతికి చెందిన ఓ వైద్యుడు నవజీవన్ కంటి ఆస్పత్రి సమీపంలో కొంత భూమిని కొనుగోలు చేశాడు. భూమికి ఆనుకుని సర్వే నంబరు 268/3లో సుమారు ఎకరా ప్రభుత్వ భూమి ఉంది. రిజిస్ట్రేషన్ పత్రాలను చూపి ఆ వైద్యుడు ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తున్నట్లు స్థానికులు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఓ సురేష్ అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. పత్రాలను పరిశీలించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని భవన యజమానికి సూచించరు.

ముగిసిన టీటీడీ ఉద్యోగుల సదస్సు



మృదంగాన్ని వాయిస్తున్న శంకరన్

తిరుపతి కల్చరల్: ఆరోగ్యకరమైన జీవనశైలితో ఆధ్యాత్మిక చింతనను పెంచుకోవడం ద్వారా మంచి జీవితాన్ని సాగించవచ్చని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. మహతిలో టీటీడీ ఉద్యోగులకు చేపట్టిన జీవన శైలి రుగ్మతులు–వ్యాధుల అనే సదస్సు సోమవారం ముగిసింది. ఆమె మాట్లాడుతూ టీటీడీ యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. టాటా క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆల్కాహాల్, పొగాకుకు దూరంగా ఉండడం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను దూరం చేయవచ్చని తెలిపారు. పద్మావతి చిన్న పిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అవయవ దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ తిరుచ్చి శంకరన్ మృదంగ విన్యాసం ఆకట్టుకుంది. డాక్టర్ ప్రశాంతి, న్యూట్రిషనిస్ట్ వెల్నెస్ కన్సల్టెంట్ దీప్తి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, ఈఈలు జగన్మోహన్‌రెడ్డి, నరసింహమూర్తి, శ్రీహరి, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, డీఈవో భాస్కర్‌రెడ్డి, డీఎఫ్‌వో శ్రీనివాస్, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్ద పీట వేయాలి



మాట్లాడుతున్న కంకణాల మునిరత్నం నాయుడు

తిరుపతి కల్చరల్: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, వైద్య, విద్యారంగాలకు పెద్ద ఎత్తున నిధులు ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం బైరాగి పట్టెడలోని పిల్లపాలెం వాసుదేవరెడ్డి గ్రంథాలయంలో కేంద్ర బడ్జెట్‌పై చర్చా గోష్టి నిర్వహించారు. ఆచార్య కంకణాల మునిరత్నం నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.రమణ, జిల్లా కోశాధికారి రేణుక, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడారు. దేశంలో వ్యవసాయం ముఖ్యమైనదన్నారు. రైతులకు సబ్సిడీ, గిట్టుబాటు ధరపై ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేయాలన్నారు. గ్రామాల్లో రవాణా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరతోపాట ఎక్కువగా సబ్సిడీ ఇవ్వాలన్నారు. విద్యా పారిశ్రామిక రంగాలకు బడ్జెట్ పెంచడంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు గురవయ్య, జిల్లా కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

భూత వాహనంపై కపిల విభుడు



భూత వాహనదారుడై ఊరేగుతున్న శ్రీసోమస్కందమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారు భూత వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అనంతరం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సోమస్కందమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు, చందనంతో అభిషేకం చేశారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు స్వామి వారి సింహ వాహన సేవ అత్యంత వేడుగా సాగింది. కపిలేశ్వర స్వామి సింహ వాహనాన్ని అధిరోహించి నగరంలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.



సింహ వాహనంపై ఊరేగుతున్న సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారు

వైభవంగా ఆలయ అంకురార్పణ



గోపుర కలశం, త్రిశూలం, గంటను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ పెద్దలు

తిరుపతి రూరల్: పుదిపట్ల పంచాయతీలో నిర్మించిన రామలింగ చాముండేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం మహిళలు గంగను, పుట్టమన్నును ఊరేగింపుగా తీసుకువచ్చారు. రాత్రి గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాసంకల్పం, రక్షాబంధనం, ధ్వజారోహణం, అంకురార్పణ, పంచగవ్య స్నపన, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం, వాస్తు హోమం, రక్షోజ్ఞ హోమం, లఘు పూర్ణాహుతి, ధాన్య, పుష్ప, ఫల, జలాధివాసం, అష్టవదన సేవ, మహామంగళ హారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు పన్నెం వాసు, శ్రీకాంత్, మనోహర్, జగదీశ్వరయ్య త్రిశూలం, కలశం, గంట తదితరాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీకాంత్, గ్రామ పెద్దలు శేఖర్, మురళి, విజయకుమార్, తిరుమల పాల్గొన్నారు.

నేడు విగ్రహాలు, గోపుర కలశ ప్రతిష్ఠ

రామలింగ చాముండేశ్వరి అమ్మవారి కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం 4 నుంచి 6 గంటల వరకు అమ్మవారు, గణపతిస్వామి, సుబ్రమణ్యస్వామి, మహాలక్ష్మి, సరస్వతిదేవి, పార్వతీదేవి, గర్భగుడి గోపుర కలశ ప్రతిష్ఠ, 108 కలశాలకు పూజ చేపట్టనున్నారు.

పరిశుభ్రతను పాటిద్దాం



స్వచ్ఛతపై ర్యాలీ చేస్తున్న ఎన్ఏఆర్ఎల్ సిబ్బంది

పాకాల : పరిశుభ్రతను పాటించి పర్యావరణాన్ని రక్షించుకుందామని ఎన్ఏఆర్ఎల్ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 15వ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛా పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ రైల్వే గేటు నుంచి రైల్వే స్టేషన్ వరకు సాగింది. అనంతరం పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటామని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉద్యోగులు, సిబ్బందికి జనపనార బ్యాగులు ఇచ్చారు. ఎన్ఏఆర్ఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ పివిసి.శర్మ, దుర్గారావు, ఎం.శ్రీనివాసగుప్తా, ఎం.రేవతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధిపై అవగాహన ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, నర్సింగ్ విద్యార్థులు

తిరుపతి తుడా: మూర్ఛవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ తెలిపారు. అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం స్విమ్స్‌లో నర్సింగ్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూర్ఛవ్యాధి వచ్చిన వెంటనే స్పందించి చికిత్స అందిస్తే 40 శాతం రికవరీ ఉంటుందన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే మూర్ఛను నయం చేయవచ్చని వివరించారు. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, పబ్లిక్ స్థలంలో డబ్బు పెట్టి పేకాట ఆడడం తదితర నేరాలకు పాల్పడిన పలువురికి 62 కేసుల్లో రూ.79,020 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు చెప్పారు. అలాగే తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన పలువురికి ఏడు కేసుల్లో రూ.7,250 జరిమానా విధించారు.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్ :

తిరుమలలో సెల్‌ఫోన్ చోరీకి పాల్పడిన కేసులో ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన జి.బాలకృష్ణ, దామినేడు నక్కలకాలనీకి చెందిన నక్కా చిన్నరాజుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

చంద్రగిరి: ఏళ్ల తరబడి వినియోగించుకుంటున్న దారిలో గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం గ్రామస్తులతో కలిసి రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ దామోదర నాయుడు తన అనుచరులతో కలిసి రెండు రోజుల క్రితం ఐతేపల్లి పంచాయతీ మామండూరు హరిజనవాడ వెళ్లే కాలిబాటలో గోడ నిర్మించారని తెలిపారు. ప్రశ్నించిన గ్రామస్తులపై దాడికి తెగబడ్డారని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. బాదూరు ఎల్లయ్య, శంకర్ పాల్గొన్నారు. స్పందించిన తహసీల్దార్ శిరీష, సీఐ ఓబులేశు సాయంత్రం మామండూరు గ్రామానికి చేరుకుని పరిశీలించారు.

మహా శివరాత్రికి బండకొండ ముస్తాబు

- రేపటి నుంచి ఉత్సవాలు
- సిద్ధ పూజకు ఏర్పాట్లు పూర్తి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని బండకొండ శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. బుధవారం నుంచి ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఆలయాన్ని తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయ నిర్మాణ సమయంలోనే చేపట్టినట్టు స్థల పురాణం చెబుతోంది. మహా శివరాత్రి సందర్భంగా తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో జరిగే కార్యక్రమాలే ఇక్కడా నిర్వహిస్తారు. మహా శివరాత్రి పర్వదినం నాడు బండకొండపై ఉన్న మడుగులో మునిగి సిద్ధేశ్వరున్ని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. బండకొండ సుమారు 100 అడుగుల ఎత్తులో ఉంటుంది. బండ బొరియలో పెద్ద మడుగు ఉంది. ఎంత కరువు వచ్చినా ఇక్కడ నీరు ఉంటుంది. ఈ నీటితోనే దేవునికి అభిషేకం, ప్రసాదాలు చేస్తారు. ఇంతటి మహిమాన్విత క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 18న స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకణ, సర్వదర్శనం, రాత్రి జాగారం, 19న ఉదయం సిద్ధపూజ చేస్తారు. ఆలయ ధర్మకర్తలు ఎలిచెర్ల కుటుంబ సభ్యులు, అరికెల ప్రమీలరెడ్డి, చట్టేవారిపాళెం గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ ఆలయానికి తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారిలోని చట్టేవారిపాళెం బస్టాప్ వద్ద బస్సు దిగి ఆటోకు వెళ్లాలి. ఇక్కడి నుంచి ఆలయం వరకు 6 కిలోమీటర్ల దూరం ఉంటుంది. శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటు చేస్తారు. ఎర్రావారి పాళెం నుంచి కూడా ఆటోలు వెళుతుంటాయి.



విశేష అలంకరణలో బండకొండ సిద్ధేశ్వర స్వామివారు